క్లుప్తంగా

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం పోశారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, అరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల ధర పెంపుపై నిరసన



ధర్నా నిర్వహిస్తున్న మహిళలు

నంద్యాల(న్యూటౌన్): గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ మంగళవారం మహిళలు మునిసిపల్ కార్యాలయం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఉమెన్స్ ఇండియా మూమెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముంతాజ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై రోజురోజుకు భారం పెరుగుతుందన్నారు. ఇప్పటికే ఆకాశన్నంటుతున్న నిత్యావసర ధరలతో సతమతమవుతున్నారని చెప్పారు. మళ్లీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం సరికాదన్నారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమెన్స్ ఇండియా మూమెంట్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యం



నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆళ్లగడ్డ: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో సీడీపీఓ తేజేశ్వరి అధ్యక్షతన మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాల ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుజాత మాట్లాడుతూ గర్భిణుల రక్త హీనతను నియంత్రించేందుకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

మహానందిలో తగ్గిన రద్దీ

మహానంది: వరుసగా సెలవులు ఉండటంతో గత మూడు రోజులుగా భక్తులతో కిటకిటలాడిన మహానంది ఆలయ ప్రాంగణాలు మంగళవారం భక్తులు రద్దీ పూర్తిగా తగ్గిపోయింది. సెలవులు కావడంతో పాటు వివాహాలు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తులు వచ్చారు. సెలవులు ముగియడంతో భక్తుల రద్దీ గణనీయంగా తగ్గిపోయింది. ఉదయం, సాయంత్రం శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లకు అష్టవిధ మహామంగళ హారతులు నిర్వహించారు.

కుంభోత్సవంలో పాల్గొన్న కలెక్టర్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా దేవి వార్షిక కుంభోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, పాన్యారు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారి వార్షిక కుంభోత్సవాన్ని పురస్కరించుకుని కుంభహారతికి ముందు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు పల్లకీసేవ నిర్వహించగా.. కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే నరేంద్ర పాల్గొన్నారు. అనంతరం కుంభహారతిలో పాల్గొని, భ్రమరాంబాదేవి నిజరూప దర్శనం చేసుకున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

దొర్నిపాడు: యువత స్వయం ఉపాధి పొందేందుకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి మే10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దొర్నిపాడు ఆంధ్రప్రగతిగ్రామీణ బ్యాంకు పరిధిలో అడ్వెంచర్ టూరింగ్, బ్యూటీపార్లల్, కోర్ ప్రొడక్ట్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ (కొబ్బరికాయల), ఎల్‌ఈడీ బల్బ్ అండ్ ఎనర్జీ సేవింగ్, ప్యాసింజర్ ఆటో, వాటర్ రీసైక్లింగ్, వెల్డింగ్ యూనిట్స్ మొత్తం యూనిట్లకు రూ. 25.10 లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. అర్హతగల ఎస్సీలు కుల, ఆదాయ, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకాలతో వెళ్లి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

- అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రామునాయక్

నంద్యాల(అర్బన్): చదువురాని వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస పథకం లక్ష్యం కూడా అదేనని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ మొదటి విడతలో 26,785 మంది వయోజన నిరక్షరాస్యులలో 23,861 మంది అక్షరాసులుగా తీర్చిదిద్ది పరీక్షలు నిర్వహించగా 23,224 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. రెండవ విడతలో 30,443 మంది వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాల పరిధిలోని వయోజనులను గుర్తించాలన్నారు. వారికి అక్షరాలు నేర్పేందుకు చదువుకున్న గ్రూప్ లీడర్లను నియమించాలన్నారు. వయోజన విద్య ఉపసంచాలకులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు, వంట సహాయకులు, వాచ్‌మెన్, ప్రభుత్వ సహాయక పాఠశాలలు, అంగన్‌వాడీ సహాయకులు/ఆయాలు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కొన్ని సంఘాల్లో మహిళలు సంతకం పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. గ్రూపు లీడర్లు వారు చదవగలిగేలా విద్యను బోధించాలని తెలిపారు. రెండవ విడత ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16వ తేదీ నుంచి ఆరు రోజులపాటు సర్వే మొదలు పెట్టి నిరక్షరాస్యులను గుర్తించాల్సి ఉందన్నారు. మే 5వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు అక్షరాస్యత నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం ఐదు నెలల పాటు రోజుకు 2 గంటల పాటు అమలయ్యేలా రూపొందించబడిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లను సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాస్యత కేంద్రాల కోసం వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని సజావుగా, విజయవంతంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డీపీఓ జమిఉల్లా, డీఎల్‌డీఓ శివారెడ్డి, మెప్మా మేనేజర్ రాములు, డీఈఓ జనార్దన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తాటి ముంజ..భలే మజా!



భాగ్యనగరంలో తాటిచెట్లు

- వేసవిలో మాత్రమే లభ్యం
- ఆరోగ్యానికి ఎంతో మేలు
- భాగ్యనగరంలో విరివిగా తాటిచెట్లు



తాటి ముంజల కొనుగోలు దృశ్యం

దొర్నిపాడు/నంద్యాల(న్యూటౌన్): తాటి ముంజలను చూడగానే నోట్లో నీళ్లూరుతాయ్. వీటిని ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఈ మండే ఎండల్లో చల్లని ముంజలు తింటే ఆ మజానే వేరు. వేసవి తాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చడంలో ఇవి మొదటి స్థానంలో ఉంటాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ తాటిముంజలు ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి. వీటి సీజన్ ఇప్పుడే ప్రారంభం కావడంతో, విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. తాటికాయలు ముంజల దశలో జెల్లీ మాదిరిగా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటిని చాలా మంది ఇష్టంగా తింటారు. ప్రస్తుతం సీజన్ కావడంతో నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాల్లో వాటి విక్రయాలు జోరందుకున్నాయి. దొర్నిపాడు మండల పరిధిలోని భాగ్యనగరం శివారులో తాటిచెట్లు అధికంగా ఉన్నాయి. చాలా మంది చిరువ్యాపారులు అక్కడి నుంచి తీసుకొచ్చి పట్టణ, మండల కేంద్రాల్లో తాటి ముంజ పరిమాణాన్ని బట్టి డజన్ రూ. 80 నుంచి 100 వరకూ విక్రయిస్తున్నారు.

ఆరోగ్య రక్షణకు దోహదం

వేసవి నుంచి వర్షాకాలం ప్రారంభం వరకూ లభ్య మయ్యే తాటిముంజలను తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుంది. పోషకాలు అధికంగా ఉండటంతో పాటు, వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. సీజన్ సమయంలో ప్రతి ఒక్కరూ భుజించాల్సిన అవసరం ఉంది.తాటి ముంజల్లో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవితాపం, వడదెబ్బ నుంచి కాపాడటంతో పాటు వికారం, వాంతులను నివారిస్తుంది.

– షహలాం, సీహెచ్‌సీ, వైద్యులు, నంద్యాల

మునిసిపల్ కమిషనర్ అక్రమాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కమిషనర్ అక్రమాలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్‌డీపీఐ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు మజీద్‌ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని మునిసిల్ పార్కులో సిబ్బంది తవ్విన గుంతలో ఓ బాలుడు పడి మృతి చెందడం జరిగిందన్నారు. ఎస్‌డీపీఐ నాయకులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. కనీస బాధ్యత లేకుండా కమిషనర్ ప్రవర్తిస్తున్నాడన్నారు. గతంలో మాజీ సైనికుడు దౌలత్‌ఖాన్ మునిసిపల్ సిబ్బంది అవినీతి వల్లే మరణించారన్నారు. కుటుంబానికి ఉద్యోగం ఇచ్చి ఆదుకుంటామని చెప్పి ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఆప్కాస్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీలో పని చేస్తున్న ఆప్కాస్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని సీఐటీయూ గౌరవాధ్యక్షులు మహమ్మద్‌గౌస్, అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్స్, ఆఫీసు స్టాఫ్, పంప్ హౌస్ వర్కర్స్, వాల్ ఆపరేటర్స్, డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్ ఇలా మొత్తం 268 మంది ఆప్కాస్‌లో పని చేస్తున్నారన్నారు. వీరి పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కరాచారి, రామాంజనేయులు, రంగనాథ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బాలదుర్గన్న, ఆదాము, సహాయ కార్యదర్శులు కృష్ణయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



అనిల్‌కుమార్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: ముత్యాలపాడు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చాగలమర్రి వాసి అనిల్ కుమార్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. ఆయన మంగళవారం చాగలమర్రిలో అనిల్‌కుమార్ మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి మాట్లాడారు. అనిల్ కుమార్ పార్టీ కోసం కష్టపడి పని చేసే కార్యకర్త అని, రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి సి.వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, వ్యాపారవేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, మనోహర్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, రమణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శేషు రమేష్, శ్రీనివాసులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీఎం కుసుమ్ పథకానికి స్థల ప్రతిపాదన



స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గోస్పాడు: పీఎం కుసుమ్ పథకానికి మండలంలోని యాళ్లూరు గ్రామంలో స్థల ప్రతిపాదన చేయడంతో ఆ స్థలాన్ని టెక్నికల్ డీఈ నాగేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఏఈ జ్ఞాన సూర్యుడు ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సోలార్ ప్లాంట్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఆదా చేసుకోవడంతో పాటు విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అందులో భాగంగా గోస్పాడు మండలం యాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలో 10 ఎకరాల పొలాన్ని ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. ఈ స్థలంలో వ్యవసాయ కనెక్షన్ల కోసం సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థల ప్రతిపాదన పూర్తయితే సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నెడ్‌క్యాప్ అధికారులు, స్థానిక వీఆర్‌ఓ భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే సిక్స్ వీక్స్ సర్టిఫికెట్ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్స్ మే 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌ద్వారా ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 8712622576 నంబరును సంప్రదించాలన్నారు.

రైతుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

గోస్పాడు: వ్యవసాయ సిబ్బంది రైతుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామ వ్యవసాయ సిబ్బంది రైతు విశిష్ట సంఖ్య నమోదు, భూసార పరీక్ష మట్టి నమూనా సేకరణ, రాయితీపై వ్యక్తిగత యంత్ర పరికరాలు, కౌలు రైతు గుర్తింపు కార్డుల నమోదుపై సమీక్షించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మహిళలకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

నంద్యాల(అర్బన్): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ లక్ష్యమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. లాభాపేక్ష లేకుండా ఎన్నో ఏళ్లుగా నిస్వార్థంగా శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయంలో మంగళవారం 102 మంది మహిళలకు 15.94 లక్షల రుణాలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శిల్పారవి మాట్లాడుతూ తమ బ్యాంకు సేవలను అడ్డుకునేందుకు కొంత మంది ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీలా, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శిరివెళ్ల: మండలంలోని గోవిందపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దివాకర్‌రెడ్డి (35) వ్యక్తి మృతి మృతి చెందాడు. సోమవారం రాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపిన వివరాల మేరకు...ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె గ్రామానికి చెందిన దివాకర్‌రెడ్డి పనుల నిమిత్త ద్విచక్ర వాహనంలో నంద్యాలకు బయలు దేరాడు. ఇంతలో గోవిందపల్లెలో గణేష్ వేబ్రిడ్జి సమీపంలో నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న గుర్తుతెలియన వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలైన దివాకర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లోని ఓప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి శివనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని శ్రమదానం బ్రిడ్జి సమీపంలో ఉన్న మురుగు కాల్వలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. నీటిలో కొట్టుకోపోతుండగా స్థానికులు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి అప్పగించారు. వారు శిశువు మృతదేహాన్ని తీసుకెళ్లి ఖననం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనదారులకు జరిమానా

రుద్రవరం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురికి ఆళ్లగడ్డ మేజిస్ట్రేట్ రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వరప్రసాదు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.తువ్వపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ, పవన్, గిద్దలూరుకు చెందిన పాములేటి అనే ముగ్గురు మద్యం తాగి వాహనం నడుపుతుండగా వారిని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. ఆ ముగ్గురిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరానికి చెందిన శిరీష అనే వివాహిత ఫిర్యాదు మేరకు నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరప్రసాదు తెలిపారు. బెస్తవారిపేటకు చెందిన భర్త వెంకటేశ్వర్లుతో పాటు బంధువులు లచ్చమ్మ, విజయ లక్ష్మి, రంగయ్య శిరీషను అదనపు కట్నం కోసం వేధించసాగారు. ఈ బాధ తాళలేక బాధితురాలు పుట్టినింటికి చేరుకొని మంగళవారం రుద్రవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అల్లుడిపై హత్యాయత్నం



గాయపడిన అశ్వినీకుమార్

పగిద్యాల: కాపురానికి బిడ్డను తీసుకెళ్లటం లేదనే ఆగ్రహంతో అల్లునిపై మామ, బావమరిది, మరికొంత మందితో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకొంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అశ్వినీకుమార్ అదే గ్రామానికి చెందిన పాలూరి మోహన్‌కుమార్ అలియాస్ నారాయణ కుమార్తె పుష్పావతిని పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. భార్యా, భర్తల మధ్య కుటుంబపరమైన విభేదాల కారణంగా ఇటీవల పుష్పావతి గ్రామంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. సుమారు ఏడాది కాలంగా భార్యా, భర్తలు వేర్వేరుగా జీవిస్తున్నారు. సోమవారం పుష్పావతి బంధువైన ఉక్కు స్వామన్న ఆమె భర్త అశ్వినీకుమార్‌ల మధ్య రాజీకుదర్చి కాపురం చక్కదిద్దేందుకు యత్నించాడు. రాజీ కుదరకపోవటంతో ఉక్కు స్వామన్న వెళ్లిపోయాడు. పంచాయతీ విఫలం కావడం.. తమ బిడ్డను కాపురానికి తీసుకెళ్లేందుకు అంగీకరించలేదనే కోపంతో పుష్పావతి తండ్రి మోహన్‌కుమార్, ఆమె అన్న మురళి క్రికెట్ బ్యాట్, ఇనుప రాడ్డుతో అశ్వినికుమార్‌పై దాడిచేశారు. గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. తలకు తీవ్రగాయాలైన అశ్వినీకుమార్‌ను కుటుంబ సభ్యులు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సచేయించారు. బాధితుడు ముచ్చుమర్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుంప్రమానుదిన్నె వృషభాల జయకేతనం



విజేతలైన ఎద్దుల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం నిర్వహించిన పెద్దబండ (సీనియర్స్ విభాగం) ఎద్దుల బండలాగుడు పోటీల్లో శిరివెళ్ల మండలం, గుంప్రమానుదిన్నె వృషభాలు విజయదుందుభి మోగించాయి. పోటీల్లో కేవలం ఐదు జతల వృషభాలు పాల్గొనగా అందులో గుంప్రమానుదిన్నె కు చెందిన కందుకూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు అత్యధిక దూరం బండనులాగి మొదటి బహుమతి రూ.70వేలు కైవసం చేసుకున్నాయి. అదే గ్రామం రాంభూపాల్‌రెడ్డికి చెందిన మరో జత ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.50వేలు దక్కించుకున్నాయి. టీ.హుసేనాపురం కు చెందిన మోతుకపాటి రామసుబ్బారెడ్డికి చెందిన ఎద్దులు తృతీయస్థానంలో నిలిచి రూ.30వేలు, గుంప్రమానుదిన్నెకు చెందిన సయ్యద్‌కలాం ఎద్దులు నాల్గొవ స్థానంలో నిలిచి రూ.20వేలు, సీసంగుంతలకు చెందిన ఆల మదన్‌మోహన్‌రెడ్డి కి చెందిన వృషభాలు ఐదోవస్థానంలో నిలిచి రూ.10వేలు చేజిక్కించుకున్నాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, దొరబాబు, రమణారెడ్డి, కోట్ల నారాయణ రెడ్డి నగదు బహుమతితో పాటు శాలువాకప్పి స్వామివారి మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లుయాదవ్, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, నారపురెడ్డి, జయన్న, గిరీశ్వరరెడ్డి, మద్దికుంట నాగార్జునరెడ్డి, మండడి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రధానమంత్రి జన్మన్, డా జుగా పథకాల కింద గుర్తించిన 11 అంశాలలో పురోగతిపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పీఓ వెంకట శివ ప్రసాద్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల్లో 48 గిరిజన నివాసిత ప్రాంతాలున్నాయన్నారు. వాటిలో గుర్తించిన సదుపాయాలను త్వరగా కల్పించాలన్నారు. గూడెంలలో గృహ నిర్మాణాలకు సంబంధించి 527 ఇళ్లు మంజూరు కాగా 92 మాత్రమే పూర్తి అయ్యాయని మిగిలిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇంటి స్థలాలు కేటాయించిన వారికి తప్పనిసరిగా పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని, సదరు సర్టిఫికెట్ ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. కొత్తపల్లిలో 38, పాములపాడులో 25, తదితర చెంచుగూడెంలలో 45 ఇళ్లు నూతంగా మంజూరు అయ్యాయని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కపిలేశ్వరం నుంచి జానాలలగూడెం వరకు వేస్తున్న 7.11 కి.మీ బిటి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సున్నిపెంట గ్రామంలో తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వానికి రూ.2,813 కోట్లతో డీపీఆర్ పంపడం జరిగిందన్నారు. సమగ్రశిక్ష ద్వారా వెలుగోడులో వంద పడకలు, కొట్టాలచెరువులో 50 పడకల కస్తూరిబా పాఠశాలల వసతి గృహాలకు భూమి పూజ చేశామన్నారు. వచ్చే ఏడాది లోపు అవి పూర్తి కావాలన్నారు. శ్రీశైలం ట్రైబల్ మ్యూజియం సమీపంలో మల్టీపర్పస్ మార్కెటింగ్ సెంటర్ ఏర్పాటుకు కోటి రూపాయలు మంజూరైనట్లు తెలిపారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా చాలా వరకు అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వంటింట్లో జరిగే అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు

నష్టం వాటిల్లకుండా చూడాలి

గోస్పాడు: గ్రామాల్లో విపత్తుల నిర్వహణ విధానంపై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అగ్ని, విద్యుత్ ప్రమాదాలతో పాటు వరదలు వంటి ఏ ఇతర విపత్తు సంభవించినా నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. అలాంటి సమయాల్లో ప్రజలు అనుసరించాల్సిన విధానాలపై సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

ఉయ్యాలవాడ : ప్రకృతి విపత్తులు, వాటి వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండటం అవసరమని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసుకుని విపత్తు ముందు, వచ్చిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలని ఉద్యోగులకు సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ రీసోర్స్ పర్సన్ దస్తగిరిబాషా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పీ 4 సర్వే, వర్క్‌ఫ్రం హోం నమోదు, ఆధార్ నమోదు వంటి అంశాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.